క్లుప్తంగా

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి

శావల్యాపురం: ఉపాధి నిధులతో చేస్తున్న పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య చెప్పారు. సోమవారం మండలంలోని ఇర్లపాడులో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు ఉన్నారు.

రేపు ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఈనెల 5వ తేది బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ సోమవారం తెలిపారు. గుంటూరు పెరల్ సంస్థ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 22 ప్రముఖ కంపెనీలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని వివరించారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జాబ్ మేళాలో 2019 విద్యా సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చన్నారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, బిటెక్, ఫార్మసీ, డిప్లమో అర్హత కలిగిన యువత తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

యాదవ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు మృతి



నరసరావుపేట: యాదవ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ చిరపరిచితుడు బోయన సుబ్బారావు (90) సోమవారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని తన స్వగృహంలో స్వర్గస్తులయ్యారు. ఆయన రిటైర్డు జీడీసీసీ బ్యాంకు ఎంప్లాయిస్ సంఘ మాజీ అధ్యక్షులు. మహాత్మా జ్యోతీరావుపూలే విగ్రహ ప్రదాతగాను, మహాత్మాగాంధీ విగ్రహ కమిటీ సభ్యులుగాను, రాష్ట్ర బీసీ సంఘ నాయకులుగా, కోటప్పకొండ అఖిలభారత ఆనందవల్లి యాదవ రాజుల అన్నదాన సత్ర నిర్మాతగా, యాదవ ఎంప్లాయిస్ సంఘ మాజీ అధ్యక్షులుగా, ఏపీ, తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘ నాయకులుగా సేవలందించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేయగా, ఎమ్మెల్సీ, టీటీడీ పాలకవర్గ కమిటీ సభ్యులు జంగా కృష్ణమూర్తి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులైన న్యాయవాది బోయిన పిచ్చేశ్వరరావు, బీఆర్‌వీకే స్వామి, బోయిన రామకృష్ణరాజులకు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆరోగ్య సేవల పరిశీలన



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు-1 గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఆరోగ్య సేవలను జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్ సభ్యులు సోమవారం పరిశీలించినట్టు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య తెలిపారు. టాస్క్‌ఫోర్సు అధికారి నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్యసేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను జిల్లా వైద్యాశాఖాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే చేసి అభిప్రాయ సేకరణ చేసినట్లు వెల్లడించారు. పాఠశాలలో చిన్నారులకు ఐరన్ మాత్రలు, రక్తహీనత పరీక్షలు తదితర వైద్యసేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా విస్తరణ అధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరి, విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి శిరీషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



యడ్లపాడు: మండలంలోని జగ్గాపురం, జాలాది, దింతెనపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం భక్తిపారవశ్యంగా జరిగింది. సోమవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక–నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో 100 ఆధ్యాత్మిక గ్రంథాలు ఇంటింటా పరిచయం చేస్తూ భగవద్గీత సారాన్ని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, జ్ఞాన వేదిక – నరసారావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దారెడ్డి, ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, అశోక్, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చినవెంకటేశ్వర్లు, వెచ్చా రాజశేఖర్, సాని కొమ్ము రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపయోగమేదీ?



వేల్పూరులో విద్యుత్ సబ్ స్టేషను

- నిరుపయోగంగా విద్యుత్ ఉప కేంద్రం
- రూ.4 కోట్లతో నిర్మాణం
- నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని సబ్‌స్టేషన్
- కూటమి ప్రభుత్వ తీరుపై అసహనం

శావల్యాపురం: వేల్పూరు గ్రామసమీపంలో గత ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రం నెలల గడుస్తున్నా ఇప్పటివరకు వెలుగులు ప్రసరించడం లేదు. దీనికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. దీతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.4 కోట్లు వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యం కలిగిన ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావటంతోపాటు రోజురోజుకు ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతుండటంతో విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే ఐదువేల నివాసాలకు విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుంది.

సబ్‌స్టేషన్‌తో ప్రయోజనాలివీ..

వేల్పూరు గ్రామంలో రెండువేలు, వెలమవారిపాలెంలో 200, గంటావారిపాలెంలో 460, పోట్లూరు 1100, బొగ్గరంలో 900 విద్యుత్ మీటర్లు ఉన్నాయి. మరో 1500 వ్యవసాయ మోటార్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్ వల్ల ఓల్టేజ్ సమస్యలు సమసిపోవడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోంది. అనధికార విద్యుత్ కోతలు ఉండవు. దీనికితోడు మండలంలోని కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లపై అదనపు లోడ్ భారం తగ్గుతుంది. భవిష్యత్‌లో విద్యుత్ అంతరాలు వాటిల్లితే ప్రత్యామ్నాయంగా వేల్పూరు సబ్‌స్టేషను పరిధిలో నుంచి మిగిలిన గ్రామాల్లోకి విద్యుత్ సరఫరా ఇచ్చేలా ముందుస్తు కార్యాచరణ రూపొందించారు. అయితే రాజకీయ కారణాలతో ఈ సబ్‌స్టేషన్‌ను కూటమి ప్రభుత్వం ప్రారంభించడం లేదు. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈనెలాఖారులోగా వినియోగంలోకి..

వేల్పూరు ఉప కేంద్రం పనులు నెలాఖారులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. సబ్‌స్టేషనులో బ్యాటరీలు చోరీ జరగటంతో పాటు విద్యుత్ కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల పనులు జాప్యమయ్యాయి. 150 మీటర్ల మేర విద్యుత్ వైర్లు పనులు కూడా చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధల మేరకు కాంట్రాక్టరును తొలిగించి విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేస్తున్నాం. నెలాఖరులోపు వినియోగంలోకి తీసుకొస్తాం.

– ప్రత్తిపాటి విజయ్‌కుమార్, ఎస్ఈ పల్నాడు జిల్లా

విద్యుత్ అధికారులు చొరవ చూపాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి. త్వరగా పనులు పూర్తి చేస్తే విద్యుత్ ఇబ్బందులు అధిగమించడానికి దోహదపడుతుంది. వేసవి సమీపిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలి. – స్వర్ణాల వెంకటరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు. వేల్పూరు

ప్రభుత్వం స్పందించాలి



వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో కొత్త విద్యుత్ సబ్ స్టేషను ఏర్పాటు చేయటం శుభాపరిణామం. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. విద్యార్థులకు పరీక్షల సమయం. విద్యుత్ సబ్ స్టేషను పనులు పూర్తయితే కోతల బాధ తప్పేది. కూటమి ప్రభుత్వం స్పందించాలి.

– ముండ్లమూరి సుహాసిని, ఎంపీపీ, శావల్యాపురం

నవధాన్య సాగుతో ఉత్తమ ఫలితాలు



వేసవి కాలంలో విత్తన గుళికలు మొలకెత్తడంపై డెమో చూపిస్తున్న అధికారులు

బొల్లాపల్లి : ఖరీఫ్ సాగుకు ముందు రైతులు తమ పొలాల్లో నవధాన్య విత్తనాలు చల్లి సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎ. అంకారావు సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో భాగంగా మండల కేంద్రంలోని ఆర్‌బీకే సెంటర్‌లో అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ నవధాన్య విత్తనాలు చల్లడం వలన చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా తమ వంతు కృషి చేయాలన్నారు. కిచెన్ గార్డెన్‌లు ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం వేసవిలో నవధాన్య విత్తనాల సాగు, అవి మొలకెత్తేందుకు అనుగుణంగా విత్తన గుళికల విధానం, వ్యవసాయ సాగుపై డెమో చేసి చూపించారు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను ఈ సమీక్ష సమావేశంలో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, వెలుగు పథకం, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్య శిబిరంలో 55 మందికి ఉచిత సేవలు



వైద్యశిబిరంలో పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: ప్రపంచ వరల్డ్ హియరింగ్‌డేను పురస్కరించుకొని సోమవారం కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 55 మందికి వైద్యసేవలు అందజేసినట్లు హాస్పిటల్ అధినేత, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో ఐదేళ్లలోపు ఐదుగురు పిల్లలు, 60ఏళ్లుపైబడిన 50 మంది పెద్దవారు వైద్యపరీక్షలు చేయించుకున్నారన్నారు. ముగ్గురికి 30 శాతం రాయితీపై వినికిడి పరికరాలు అందజేశామన్నారు. డాక్టర్ శ్రీవర్షిణి, డాక్టర్ విష్ణురాజ్, సీఎంవో మస్తాన్‌రెడ్డి, ఆడియాలజిస్టు కోటేశ్వరరావు, ప్రసాదు, మహేష్ శిబిరంలో సేవలు అందజేశారని పేర్కొన్నారు.

వరికెపుడిశెలకు నిధులు కేటాయించాలి

ఎంపీ లావును కోరిన ప్రజాసంఘాల నాయకులు



క్యాంపు కార్యాలయంలో ఎంపీ లావుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: ఎగువ పల్నాడు, బొల్లాపల్లి ప్రాంతాలకు ఉపయోగపడే వరికెపుడిశెల ప్రాజెక్టుకు కావాల్సిన నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ లావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే బొల్లాపల్లి మండలంలో తాగునీటికోసం ఇబ్బంది పడుతున్న ప్రజల బాధలు తీరుతాయన్నారు. అప్పటివరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా మంచినీరు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తనదేనని, తప్పనిసరిగా దాని కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటా నాయక్, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సురభి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పమిడిపాడు బ్రాంచ్ కెనాల్‌కు వారబందీ అమలు



సమావేశంలో పాల్గొన్న డీసీ చైర్మన్లు,ఎన్నెస్పీ అధికారులు

నూజెండ్ల: పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని జమ్మలమడక, మోదేపల్లి, మేజర్లకు బుధవారం నుంచి వారబందీ అమలు చేస్తున్నట్లు వినుకొండ డీఈఈ డి.వి. నారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని రవ్వవరం కాలువ వద్ద రెండు మేజర్ల పరిధిలోని డీసీ చైర్మన్లు, దరిశి వినుకొండ ఎన్నెస్పీ అధికారులు, రైతులు సమావేశమయ్యారు. పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ నీటి విడుదల తగ్గటం కారణంగా కాలువ చివరి భూములకు నీరు అందాలంటే వారబందీ తప్పనిసరని పేర్కొన్నారు. రైతుల ఒప్పందం మేరకు బుధవారం నుంచి నాలుగురోజుల పాటు జమ్మలమడక, తర్వాత నాలుగురోజులు మోదేపల్లి మేజరుకు నీటి విడుదల జరగాల్సి ఉంది. అయితే పమిడిపాడు కెనాల్ సామర్థ్యం మేరకు నీటి విడుదల జరిగేలా చూడాలని ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డీఈఈ పూర్ణచంద్రరావు, వినుకొండ జూనియర్ ఈఈలు ప్రసన్న, కేశవరావు, గోపాల్, ప్రకాశం జూనియర్ ఈఈ ప్రసాదు, కాకాని వీరాంజనేయులు, వర్కర్ బ్రహ్మనాయుడు రైతులు పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయుల దాడి

- బాధితులపైనే కేసు నమోదు చేసిన పోలీసులు
- పరామర్శించిన మాజీ మంత్రి విడదల రజిని



పున్నారావును పరామర్శిస్తున్న విడదల రజిని

యడ్లపాడు: దాడికి పాల్పడిన వారిని వదిలి బాధితుల పైనే పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన యడ్లపాడు మండలం మర్రిపాలెంలో వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. కారు డ్రైవర్‌గా పనిచేసే కొమ్మూరు పున్నారావు కుమారుడు 8వ తరగతి విద్యార్థి సాగర్ ఫిబ్రవరి 27న ఇంటికి వస్తుండగా మోపెడ్‌పై వస్తున్న మరియదాసు అడ్డగించి తన మోపెడ్‌కే అడ్డు వస్తావా అంటూ దూషణలకు దిగాడు. దాడికి యత్నించాడు. దీంతో భయపడిన సాగర్ ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లి శౌరమ్మకు వివరించాడు. శౌరమ్మ మరియదాసు, అతని కుటుంబ సభ్యులను ప్రశ్నించగా వారు ఆమెనూ దూషించారు. ఇదిలా ఉండగా అదేరోజు రాత్రి ఇంటికి చేరుకుంటున్న కొమ్మూరి పున్నారావును మరియదాసుతోపాటు చినబాబు, సాంబయ్య, వీరాస్వామి అడ్డగించి దాడి చేసి కొట్టారు. అతను రెండోరోజు విధుల నిమిత్తం వెళ్లే క్రమంలోనూ మళ్లీ దాడి చేశారు. ''మేము అధికార టీడీపీకి చెందిన వాళ్లం.. నీవు వైఎస్సార్ సీపీకి చెందిన వాడివి.. మా వీధి నుంచి నడిచే అర్హత లేదు.. అవసరమైతే అడ్డంగా నరికేస్తాం..'' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన పున్నారావు కుటుంబ సభ్యులతో కలిసి యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. అయితే అప్పటికే ప్రత్యర్థి వర్గీయులు ఫిర్యాదు చేశారంటూ పున్నారావు ఫిర్యాదును తీసుకునేందుకు పోలీసులు నిరాకరించారు. పున్నారావుతోపాటు అతని భార్య శౌరమ్మ, కుమారుడు సాగర్, కొమ్మూరి శ్రీను, కొమ్మూరి రాజేష్‌లను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. రాత్రికి వెళ్లి మరుసటి రోజు రావాలని చెప్పారు. దీంతో పున్నారావు గుంటూరు వెళ్లి జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందాడు. మిగిలిన కుటుంబ సభ్యులను మూడు రోజుల పాటు రోజు ఉదయం స్టేషన్‌లో కూర్చొబెట్టారు. చికిత్స అనంతరం పున్నారావు ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విడదల రజిని సోమవారం మర్రిపాలెం వచ్చి పున్నారావును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల వైఖరిపై ధ్వజమెత్తారు. పున్నారావు కుటుంబానికి అవసరమైన న్యాయ సహాయం అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముప్పాళ్ళ వాసి మృతి



ఈపూరు(శావల్యాపురం): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఈపూరు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు కథనం మేరకు మండలంలోని ముప్పాళ్ళ గ్రామానికి చెందిన పులుకూరి గోపిచంద్ (25) పొలం పనుల నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన మిర్చి కూలీలతో బయలుదేరిన వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. తక్షణమే స్థానికులు సమీపంలోని ముప్పాళ్ళ ఆరోగ్య కేంద్రం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శవపంచనామా నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు కృష్ణవేణి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 8మంది విద్యార్థులు ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కంపెనీ అపిటా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న గుంటూరు కిట్స్ కళాశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ఎంపికైన వారికి ఫిబ్రవరి 21న ఇంటర్వ్యూలు జరిపారని తెలిపారు. సోమవారం ఇన్ఫోసిస్ కంపెనీ విడుదల చేసిన ఫలితాలలో తమ విద్యార్థులు 8 మంది ఎంపికయ్యారని వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాతాని, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సెకండింటర్ పరీక్షలు ప్రారంభం

కళాశాలను సందర్శించిన డీఐఈఓ నీలావతి



గణపవరం సీఆర్ కళాశాలలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

నాదెండ్ల/వినుకొండ: జిల్లాలోని 48 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలను అత్యాధునిక విధానంలో వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు డీఐఈఓ ఎం.నీలావతి చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 469 మందికి 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలావతి మాట్లాడుతూ ఈ నెల 15 వరకూ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, 20వ తేదీ వరకూ బ్రిడ్జి కోర్సు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 32,463 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష జరుగుతుందని, ఒక్క నిమిషం నిబంధన అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కారంపూడి ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఏవీ శ్రీవత్స, డీవో రేణుకాదేవి, కో–ఆర్డినేటర్‌గా ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు వ్యవహరించారు.

- వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 427 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 412 మంది పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ నేత మాబు మేస్త్రీ మృతి



పఠాన్ మాబుమేస్త్రీ(ఫైల్)

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మైనార్టీ నేత పఠాన్ మాబుమేస్త్రీ(80) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే దివంగత సోమేపల్లి సాంబయ్య అనుచరుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చేరి ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. జీపు మెకానిక్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆయన ఎందరో మెకానిక్‌లకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దారు. జీపుల పరిశ్రమల చిలకలూరిపేటలో విస్తరించటానికి ఇతోధికంగా పాటుపడ్డారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి విడదల రజిని, వివిధ పార్టీల నాయకులు పట్టణంలోని గుండయ్యతోటలోని ఆయన నివాసానికి చేరుకొని భౌతిక కాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వందే వనితరం



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ వెంకటరమణ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు, అంగన్వాడీలు

మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు



నాదెండ్లలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో స్వరూప రాణి, సీడీపీవో శాంతకుమారి, అంగన్‌వాడీలు



రొంపిచర్లలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నరసరావుపేట: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి బీసీ కాలనీ వరకు మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కేవీ సుభాషిణి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ ఉమామహేశ్వరి, జిల్లా ఉమెన్ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ ఆర్.అరుణ, ఎక్‌టెన్షన్ ఆఫీసర్ ఆదిలక్ష్మి, మహిళా, శిశు అభివృద్ధి సాధికారిత అధికారి ఎం.ఉమాదేవి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళ భద్రతా, హక్కుల సాధికారిత తదితర అంశాలపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించామని ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

ఆడపిల్ల పుట్టిన ప్రతి ఇంట్లో ఓ మొక్క నాటాలి

నూజెండ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో ఎస్.రవిచంద్ర అన్నారు. ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నూజెండ్ల మండలంలోని పలు గ్రామాల్లో ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టారు. సోమవారం నూజెండ్ల జడ్పీ పాఠశాలలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టిన ప్రతి ఇంటి ఆవరణలో మొక్క నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ర్యాలీ అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఇన్నాసమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా రాణించాలి

నాదెండ్ల: మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని ఎంపీడీఓ స్వరూపరాణి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ముందస్తు ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీఓ శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపరాణి మాట్లాడుతూ బాలికలకు పలు అంశాలపై సూచనలు చేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



నూజెండ్లలో ఆడపిల్ల పుట్టిన ఓ ఇంటి వద్ద మొక్క నాటుతున్న ఎంఈవో రవిచంద్ర

శావల్యాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించినట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, కుమ్మరి శ్రీనివాసరాజు, అబ్దుల్లా, భువనేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

తెలంగాణలో పనిచేస్తున్న హోంగార్డులను ఏపీకి బదిలీ చేయించాలి

–ప్రభుత్వాన్ని కోరిన ఏఐవైఎఫ్ నాయకులు

నరసరావుపేట: తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డులను ఏపీకి బదిలీ చేయించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ సుభాని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఏకా మురళికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రానికి చెందిన వేలమంది హోంగార్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హోంగార్డులుగా ఎంపికై రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలోనే ఉండి పోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ మేరకు హోంగార్డులకు మద్దతుగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలలో వినతి పత్రాలు ఇచ్చి ప్రభుత్వ దృష్టికి సమస్య తీసుకువెళ్తున్నట్టు వివరించారు. నాయకులు కె.మల్లికార్జున్, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com